పరవళ్లు తొక్కుతున్న వెంకయ్య కాల్వ

ప్రజాశక్తి - ఆకివీడు

వెంకయ్య కాలువ గట్లతో సమానంగా ప్రవహిస్తుండటం ఆ ప్రాంతవాసులను భయాందోళనకు గురిచేస్తోంది. ఈ కాల్వ ఉప్పొంగితే సుమారు 10 నుండి 15 గ్రామాల ఆయకట్టులోని పంటలన్నీ వరద బారిన పడనున్నాయి. పరిమెళ్ల లాకుల వద్ద నీటిమట్టం పెరిగి దిగువకు నీరు వదులుతుండటంతో ఈ కాలవ ఉగ్రరూపం దాల్చింది.

ఎగసిపడుతున్న వెంకయ్య కాల్వ

డ్రెయిన్లన్నీ ప్రక్షాళన

ఏలూరు బస్టాండ్ వద్ద తమ్మిలేరును పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

కౌలురైతులకే పంట నష్ట పరిహారం

పరిహారం ఎకరాకు రూ.6,800 నుంచి రూ.పది వేలకు పెంపు

కొల్లేరులో రెగ్యులేటర్ల నిర్మాణంపై పరిశీలిస్తాం

వరదల్లో నష్టపోయిన ప్రతిఒక్కరికీ న్యాయం చేస్తా

శనివారపుపేట కాజ్‌వేపై వంతెన నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు

ఏలూరు పర్యటనలో సిఎం చంద్రబాబు

తమ బాధలను ఏకరవు పెట్టిన వరద బాధితులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, అర్బన్, సిటీ

పెదపాడులో లోయర్ డ్రెయిన్‌తోపాటు అన్ని డ్రెయిన్లనూ పూర్తిగా బాగు చేయించి శివారు భూములకు సాగు నీరందిస్తామని, గత ప్రభుత్వం డ్రెయిన్లలోని పూడికతీతలో నిర్లక్ష్యం వహించడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని సిఎం చంద్రబాబు తెలిపారు. వరద పర్యటనలో భాగంగా జిల్లాకు విచ్చేసిన ఆయన ముందుగా కొల్లేరు, తమ్మిలేరు, ఉప్పుటేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం 11.48 గంటలకు ఏలూరు సిఆర్ఆర్ కాలేజీలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు సిఎం చేరుకున్నారు. అక్కడ నుంచి రోడ్డుమార్గం గుండా కొత్త బస్టాండ్ వద్ద ఉన్న వంతెన వద్దకు చేరుకుని తమ్మిలేరు వరద పరిస్థితిని పరిశీలించారు. అక్కడ నుంచి సిఆర్ఆర్ ఆడిటోరియం ప్రాంతానికి చేరుకుని వరదల ప్రభావంపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. తర్వాత వరద బాధితులతో ఏర్పాటు చేసిన ముఖాముఖీలో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి వరద నష్టం, ప్రస్తుత పరిస్థితిని సిఎంకు వివరించారు. నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పి.వెంకట్రావు మాట్లాడుతూ నూజివీడు పెద్ద చెరువుకు గండి పడటంతో నీటిప్రవాహంలో చిక్కుకుని స్తంభం పట్టుకుని ఉన్నానని, మంత్రి కొలుసు పార్థసారథి జోక్యంతో ఎస్‌డిఆర్ఎఫ్ బృందం రక్షించిందన్నారు. ముదినేపల్లి మండలం పెదమానూరుకు చెందిన పొత్తుల నాగేశ్వరరావు మాట్లాడుతూ వరదలకు తన ఇల్లు కూలిపోయిందని, బంధువుల ఇంటికి వెళ్లి తలదాచుకున్నానని, ఇంటినిర్మాణానికి సాయం చేయాలని కోరారు. పెదపాడు మండలం గోగుంటకు చెందిన తిరువీధుల ఊర్మిళ మాట్లాడుతూ వరదల కారణంగా తమ గ్రామం నీట మునిగిందని, అధికారులు పునరావాస కేంద్రానికి తరలించి అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. వరదలకు సర్వం కోల్పోయామని, ఆదుకోవాలని కోరారు. ఏలూరుకు చెందిన విద్యార్థి అనుషా మాట్లాడుతూ శనివారపుపేట కాజ్‌వేలతోపాటు పవరుపేటలోని అండర్ గ్రౌండ్‌బ్రిడ్జి, పోణంగి ముంపునకు గురయ్యాయని, ఏలూరు నగరం ముంపునకు గురికాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరారు. పెదపాడు మండలం కడింగుంటకు చెందిన కిషోర్‌బాబు మాట్లాడుతూ తమ మండలంలో లోయర్ డ్రెయిన్ కారణంగా వరదల సమయంలో 300 ఎకరాలు ముంపునకు గురయ్యాయన్నారు. డ్రెయిన్ మరమ్మతులు చేయించాలని కోరారు.

సిఎం చంద్రబాబు నాయుడు మంత్రి నిమ్మల రామానాయుడు

కొల్లేరుకు చెందిన ఘంటసాల పెద్దిరాజు మాట్లాడుతూ ఉప్పుటేరు నీటి ప్రవాహ సామర్థ్యాన్ని పెంచాలని, పది అడుగుల మేర పూడిక తీయాలని, ఉప్పుటేరుపై రెగ్యులేటర్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. అనంతరం సిఎం చంద్రబాబు మాట్లాడుతూ బుడమేరు, కృష్ణా నది వరదల ఇబ్బందులు, చక్కదిద్దిన తీరు తెలిపారు. జిల్లాకు చెందిన మంత్రి నిమ్మల రామానాయుడు ఎంతో కష్టపడి బుడమేరు గండ్లు పూడ్పించారన్నారు. వైసిపి నాయకుల తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. జిల్లాలో తమ్మిలేరు, ఎర్రకాలువ వరదలతో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. వరదలకు నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని సిఎం తెలిపారు.

కౌలురైతులకే పరిహారం

పంట వేసి 70 రోజులు గడిచిన తర్వాత దెబ్బతింటే ఆ రైతు బాధ వర్ణనాతీతం అంటూ సిఎం చంద్రబాబు తెలిపారు. వ్యవసాయ సాగులో 70 శాతం కౌలురైతులే చేస్తున్నారని, పెట్టుబడి మొత్తం వారే పెడుతున్నారని అన్నారు. పంట నష్టపరిహారం కౌలురైతులకే అందిస్తామన్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో అత్యధికంగా కౌలురైతులు ఉండటంతో ప్రభుత్వ నిర్ణయం రైతులకు మేలుచేయనుంది. పంట నష్టపరిహారం ఎకరాకు రూ.పది వేలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణంపై పరిశీలిస్తామన్నారు. ఉప్పుటేరు సమస్యను ఇరిగేషన్ మంత్రి రామానాయుడు చూస్తారన్నారు. 17వ తేదీలోపు పంట నష్టానికి సంబంధించిన విధివిధానాలను విడుదల చేస్తామని తెలిపారు.

శనివారపుపేట కాజ్‌వేపై వంతెన నిర్మాణం

ఏలూరు నగర నడిబొడ్డు నుంచి శనివారపుపేటకు వెళ్లే మార్గంలో తమ్మిలేరుపై ఉన్న కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మాణానికి రూ.15 కోట్లు కేటాయిస్తున్నట్లు సిఎం ప్రకటించారు. తమ్మిలేరుకు వరదొచ్చిన ప్రతిసారీ కాజ్‌వేపైకి నీరు చేరడంతో రాకపోకలను నిలిపివేస్తున్నారు. దీంతో వేలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి సిఎం చంద్రబాబు దృష్టికి ఈ విషయం తీసుకెళ్లడంతో సిఎం స్పందించి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వరద బాధితుల సహాయార్థం సిఆర్ఆర్ విద్యాసంస్థల తరపున రూ.20 లక్షల చెక్కు, ఫిషరీష్, విజిటేబుల్స్ సంఘం తరపున రూ.12 లక్షల చెక్కును సిఎంకు అందించారు. సిఎం పర్యటనలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి, ఎంపీ పుట్టా మహేష్, ఎంఎల్ఎలు చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి, కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, కనుమూరి రఘురామకృష్ణంరాజు, మేయర్ నూర్జహాన్, టిడిపి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మంతెన రామరాజు పాల్గొన్నారు. హెలీప్యాడ్ వద్ద సిఎంకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికిన వారిలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ దంపతులు ఉన్నారు.

సిఎం మంత్రి పార్థసారథి, ఎంఎల్ఎ చంటి మాటామంతీ

సిఎంలో మాట్లాడుతున్న ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు



సిఎం విరాళం అందజేస్తున్న ప్రముఖులు

అయోధ్యలంకలో కొబ్బరికాయలను పడవలపై ఒడ్డుకు చేర్చుతున్న రైతులు

భీమలాపురంలో రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

పోటెత్తిన గోదావరి

ముంపు అంచున లంక గ్రామాలు

ప్రజాశక్తి - ఆచంట

గోదావరికి వరద పోటెత్తుతోంది. దీంతో లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. గోదావరి మధ్యలో చిన్నపాటి దీవులుగా ఉండే లంక గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు. ఆయా గ్రామాలకు వెళ్లి రావాలంటే నాటు పడవలను ఆశ్రయించక తప్పదు. గోదావరికి వరద వచ్చిందంటే ఆ ప్రాంత ప్రజలు కష్టాలు ఎనలేనివి. కొద్దిరోజులుగా వశిష్ట గోదావరి వరద దోబూచులాడుతోంది. తగ్గుతూ.. పెరుగుతూ.. తగ్గుతూ అటు అధికార యంత్రాంగాన్ని, ఇటు లంక గ్రామాల ప్రజలను కలవరపెడుతోంది. బుధవారం ఉదయం నుంచి వశిష్ట గోదావరి ఉధృతి మళ్లీ పెరుగుతోంది. ప్రస్తుతం పెదమల్లం పర్యాటక కేంద్రం, మాచేనమ్మ ఆలయం, కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురంల్లో పుష్కర ఘాట్ల మెట్లు నీట మునిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు రెండు అడుగులు మేర నీటిమట్టం పెరిగింది. వరద ఉధృతి నేపథ్యంలో లంక గ్రామాలకు పడవలపై రాకపోకలు నిషేధించారు. భీమలాపురంలో ఏటిగట్టుకు దిగువన ఉన్న దాదాపు వంద కుటుంబాల వారు కలవర పడుతున్నారు. ఆచంట మండలం పెదమల్లం పంచాయతీ పరిధి ఆనగార్లలంక, పెదమల్లం లంక, కోడేరు పల్లిపాలెం, అయోధ్య లంక గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదు. ఆయా గ్రామాలు పూర్తిగా గోదావరి మధ్యలో ఉంటాయి. వారు బాహ్య ప్రపంచంలోకి అడుగు పెట్టాలంటే పడవలను ఆశ్రయించక తప్పదు. భారీగా వస్తున్న గోదావరి వరదతో లంక గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశించడం మొదలైంది. ప్రస్తుతం లంక గ్రామాల్లో రైతులు పశువులను ఎత్తైన సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆనగార్లలంక, పెదమల్లం లంక, పల్లెపాలెం, అయోధ్య లంక, మర్రిమూల, పుచ్చల్లంక, రాయిల్లంక, పెద్దపేట గ్రామాల్లో దాదాపు ఏడు వేల మంది వరకు నివాసం ఉంటున్నారు. వీటిలో ఆనగార్లలంక, అయోధ్యలంక గ్రామాల పరిస్థితి మరీ దయనీయం.

నరసాపురం : ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

వంతెన నిర్మాణాన్ని విస్మరించిన పాలకులు

అయోధ్యలంక, ఆనగార్లలంక ప్రజలు ఎప్పటి నుంచో వంతెనలు నిర్మించాలని కోరుతున్నారు. అయితే వీరి వేదన అరణ్య రోదనగానే మిగులుతోంది. నాటు పడవల్లో రాకపోకలు సాగిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. 2012 నవంబర్ 18న అయోధ్యలంక, మర్రిమూలకు చెందిన 28 మంది మత్స్యకారులు పెదమల్లంలోని మాచేనమ్మ ఆలయానికి వెళ్లి తిరిగొస్తుండగా పడవ ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో నలుగురు మహిళలు మృతి చెందారు. దాదాపు మూడు దశాబ్దాల క్రితం ఆనగార్లలంకకు చెందిన పది మంది ఇలానే ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ ఉన్నాయి. ప్రజల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వాలకు మాత్రం వంతెనల నిర్మాణం పట్టడం లేదు. అయోధ్యలంకలో 2014 సార్వత్రిక ఎన్నికలకు ముందు రూ.50 కోట్లతో అయోధ్యలంక-పుచ్చల్లంకను కలుపుతూ వంతెన నిర్మాణానికి ప్రస్తుత ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. నాటి నుంచి మళ్లీ దీని నిర్మాణాన్ని పట్టించుకునే నాథుడే లేడు.

నరసాపురం: నరసాపురంలో వశిష్టగోదావరి ఉధృతి క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతానికి ప్రవాహం ప్రమాదకరంగా లేనప్పటికీ, గురువారం ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారుల అంచనా. నవరసపురం గ్రామానికి ముంపు గండం పొంచి ఉంది. పట్టణంలో గోదావరిని ఆనుకుని ఉన్న పొన్నపల్లి, మాధవాయిపాలెం, కొండాలమ్మగుడి ప్రాంతం, నందమూరి కాలనీలకు ముంపు ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే గోదావరిపై నరసాపురం-సఖినేటిపల్లి నడుమ పంటు రాకపోకలు నిలిపివేశారు.

వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - పోడూరు

జిల్లాలో వ్యాధుల నివారణకు జాప్యం లేకుండా అన్ని రకాలైన చర్యలు ముమ్మరంగా చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం కోరారు. బుధవారం స్థానిక పరుశ రామిరెడ్డి కళ్యాణ మండపంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు విపరీతంగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నడూ లేనంతగా జిల్లాలో జనం జ్వరాలతో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. నివాస ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలైన డ్రెయినేజీలు, రోడ్లు లేక మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. డెంగీ, మలేరియా వంటి తీవ్రమైన వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. జిల్లాలో పారిశుధ్య పనులపై అధికారులు జాప్యం చేస్తున్నారని విమర్శించారు. తక్షణం పట్టణాలు, గ్రామాల్లో పారిశుధ్యం పనులు వేగవంతం చేయాలని, మురుగునీరు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ముంపు ప్రభావిత ప్రజలకు పునరావాసం కల్పించడంలో అధికారులు చొరవ చెయ్యాలని విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రయివేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

కాలం చెల్లిన బస్సులు, వయస్సు మళ్లిన డ్రైవర్లతో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రయివేట్ విద్యాసంస్థలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని బలరాం డిమాండ్ చేశారు. ఇటీవల భీమవరం పట్టణంలో ప్రయివేట్ విద్యాసంస్థ బస్సు అతి వేగం కారణంగా విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడని, పాలకోడేరు శివారులో అతివేగం వల్ల మరో బస్సు అదుపుతప్పి తోటల్లోకి దూసుకెళ్లి విద్యార్థులు గాయాల పాలయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖాధికారులు ప్రయివేట్ విద్యాసంస్థల్లో తనిఖీల్లో విఫలమవుతున్నారని మండిపడ్డారు. కాలం చెల్లిన బస్సులను రవాణాశాఖాధికారులు అనుమతించడం సబబు కాదన్నారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యాన ఆందోళనలు ఉధృతం చేస్తామనిహెచ్చరించారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు, చింతకాయల బాబూరావు, డి.కళ్యాణి, పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, కవురు పెద్దిరాజు, సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహామూర్తి, జిల్లా కమిటీ సభ్యులు కె.రాజారామ్మోహన్‌రాయ్, సూర్నీడు వెంకటేశ్వరరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిఒల రద్దు కోరుతూ వైద్య సిబ్బంది నిరసన

ప్రజాశక్తి - తణుకు

జిఒ 115ను తక్షణం రద్దు చేయాలని, కాంట్రాక్టు నర్సులను రెగ్యులర్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి వద్ద నర్సులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆసుపత్రి పర్యవేక్షణాధికారి డాక్టర్ వెలగల అరుణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సులు మాట్లాడుతూ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ, సంక్షేమ శాఖ ఇటీవల జారీ చేసిన జిఒ 115ను వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 11,500 మంది నర్సులు (మేల్, ఫిమేల్) కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల కారణంగా సచివాలయంలో పనిచేస్తున్న ఎఎన్ఎంలకు ఎంపీహెచ్‌డబ్ల్యూ పేరుతో నామమాత్రపు శిక్షణ ఇచ్చారన్నారు. వారు ఎంత శిక్షణ పొందినప్పటికీ, నాణ్యమైన వైద్య సేవలను ఎఎన్ఎంలు అందించలేరని స్పష్టంచేశారు. శిక్షణ పొందిన సచివాలయ ఎఎన్ఎంలు రాష్ట్రంలో పలు ఆసుత్రుల్లో స్టాఫ్ నర్సులుగా విధులు నిర్వర్తించేందుకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని సమీక్షించుకోవాలని లేని పక్షంలో అత్యవసర సేవలను నిలిపివేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, శ్రీజ, లక్ష్మీ, అనిత, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

నరసాపురం: జిఒ 115ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రి వద్ద నర్సులు ఒంటి కాలుపై నిలబడి ఆందోళన చేశారు. కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్స్ స్ట్రగుల్ కమిటీ, ఎపి మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసననుద్దేశించి కమిటీ అధ్యక్షురాలు సిహెచ్.చిట్టితల్లి మాట్లాడుతూ జిఒ.115 ద్వారా ప్రభుత్వం ఎవరైతే ఎఎన్ఎంలుగా ఉండి ఇంటెన్సిఫైడ్ శిక్షణ తీసుకున్నారో వారిని స్టాఫ్‌నర్సులుగా నియమించాలని నిర్ణయించడం తగదన్నారు. వెంటనే జిఒనెం.115ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.విజయకుమారి, ఎం.సుష్మ, ఎ.సూర్యకుమారి, కె.మధులత, కె.శిరీష, రాజా రాణి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో ఆందోళన చేస్తున్న నర్సులు

నరసాపురంలో ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న నర్సులు

జిఒ 85కు వ్యతిరేకంగా..

తాడేపల్లిగూడెం: ఎపి ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు బుధవారం వెంకటరామన్నగూడెం పిహెచ్‌సిలో డాక్టర్ శ్రీహర్ష డాక్టర్ రూపాదేవి విధులకు నల్లబ్యాడ్జీలు ధరించి హాజరై నిరసన తెలిపారు. ఈ జిఒ వల్ల తమ మూడేళ్ల సర్వీసు అర్థం లేకుండా పోయిందని వాపోయారు. తక్షణం జిఒ 85ను రద్దు చేయాలని కోరారు.

తాడేపల్లిగూడెంలో నల్లబ్యాడ్జీ ధరించి విధులు నిర్వహిస్తున్న డాక్టర్

కార్మిక నేత బాబాయ్ అంత్యక్రియలు పూర్తి

ప్రజాశక్తి - నరసాపురం

సిఐటియు పట్టణ కార్యదర్శి, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పొన్నాడ రాము (బాబాయ్) (51) అంత్యక్రియలు బుధవారం పూర్తయ్యాయి. ఆయన సోమవారం విశాఖపట్నంలో బంధువుల ఇంటికి వెళ్లి గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన కుమారుడు మధు ఉపాధి నిమిత్తం జమ్మూ కాశ్మీర్‌లో ఉండటంతో అంత్యక్రియలు ఆలస్యమయ్యాయి. మంగళవారం రాత్రి మధు నరసాపురం చేరుకోవడంతో బుధవారం ఉదయం అంతిమయాత్ర నిర్వహించారు. తొలుత రాము భౌతికకాయాన్ని కొత్త కాలనీలో ఇంటి వద్ద సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, కవురు పెద్దిరాజు బాబాయ్ బాబాయ్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ బాబాయ్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుంచి మిషన్ హైస్కూల్ రోడ్డు, పంజాసెంటర్, పాత బజారు, మెయిన్ రోడ్డు, స్టీమర్ రోడ్డు, శ్రీహరి పేట మీదుగా సిపిఎం కార్యాలయానికి తరలించారు. అక్కడ సిపిఎం నేతలు రాము భౌతికకాయంపై పార్టీ పతాకాన్ని కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్, మొగల్తూరు రోడ్డు మీదుగా రుస్తుంబాద శ్మశాన వాటికకు చేర్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ, నేతలు పూరిళ్ల శ్రీనివాస్, ముచ్చర్ల త్రిమూర్తులు, పొగాకు నారాయణరావు, మంచిలి నీలకంఠం, నోముల కొండ, బూడిద జోగేశ్వరరావు, ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపురంలో బాబాయ్ అంతిమయాత్ర

బాబాయ్ మృతదేహానికి నివాళు లర్పిస్తున్న ఎంఎల్ఎ నాయకర్

వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి - నరసాపురం

గోదావరి వరద ఉధృతికి ముంపునకు గురైన నరసాపురం పట్టణంలోని 2వ వార్డు పొన్నపల్లిలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మోటార్లతో వరద నీటిని తోడించే పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం 15వ వార్డు బరియల్ గ్రౌండ్ ప్రాంతంలో పేరుకుపోయిన బురదను జెసిబితో తొలగించే పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట వేమవరం జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు వరద బాధితుల సహాయార్థం రూ.50,700 విరాళం సేకరించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని కృష్ణవేణి తెలిపారు. ఈ విరాళాల చెక్కును వరద బాధితులకు అందజేయడానికి ఆర్‌జెడ్‌యు సమక్షంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి ఎంఇఒ-2 పి.రాజేంద్రప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని కృష్ణవేణి, ఉపాధ్యాయులు సుధాకర్, స్కూల్ ఛైర్మన్ గుత్తుల చిరంజీవి అందజేశారు.


ట్రస్ట్ తరఫున ఆర్థిక సాయం చేస్తున్న సభ్యులు

దాట్ల శ్రీదేవి ట్రస్ట్ సేవలు భేష్

ప్రజాశక్తి - కాళ్ల

దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని ట్రస్ట్ సభ్యులు పెన్మెత్స నాగరాజు అన్నారు. అన్నసమారాధనకు దాట్ల శ్రీదేవి ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు నగదు అందించేందుకు ముందుకొచ్చారు. దొడ్డనపూడి గ్రామ కచ్చా గురువు ప్రాంతంలో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకల సందర్భంగా అన్నదానం నిమిత్తం బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. రూ.5,116 ట్రస్ట్ సభ్యులు పెన్మెత్స నాగరాజు, ఈదా భోగేష్, కోలా అంజనేయులు తదితరులు అందజేశారు.

డైమండ్స్ లయన్స్ సేవలు స్ఫూర్తిదాయకం

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విజయవాడ ముంపు ప్రాంతంలో ప్రభుత్వంతో పాటు డైమండ్స్ లయన్స్ సేవలు, ఇతర స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారం స్ఫూర్తిదాయకమని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ప్రభుత్వ యంత్రాంగం ప్రతి బాధితుడినీ ఆదుకునే విధంగా కృషి చేస్తోందన్నారు. తాడేపల్లిగూడెం డైమండ్ లయన్స్ క్లబ్ సభ్యుల వారాలోళ్లను నుంచి జరుగుతున్న సహాయ కార్యక్రమాలను అభినందనీయమన్నారు. లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు నేతృత్వంలో లియో ధనలక్ష్మి మాధురి, తమ్మిన జగదీశ్వరరావు సహకారంతో డైమండ్స్ టీం మునగాల జితేంద్ర చెన్నా రెడ్డి, సతీష్, నార్ని చిన్ని, మనేపల్లి సునీల్ కుమార్, ఆకుల సతీష్ నాయుడు, గోపీకృష్ణ పాల్గొన్నారు.

కొత్త చెరువుగట్టులో అన్న సమారాధన

ప్రజాశక్తి - కాళ్ల

పదేళ్ల నుంచి కొత్త చెరువుగట్టులో వినాయక చవితి వేడుకలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు కొల్లి వరప్రసాద్ బుధవారం తెలిపారు. దొడ్డనపూడి గ్రామం కొత్త చెరువుగట్టులో వినాయక చవితి వేడుకల సందర్భంగా అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా యాత్రికులు వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అన్న సమారాధనకు సర్పంచి కొల్లి సుబ్బరాజు, దాట్ల శ్రీదేవి ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు పలువురు దాతలు, గ్రామస్తులు తమ వంతు సహకారం అందించారు. కార్యక్రమంలో తోట వాసు, మల్లుల పండు, జడ్డు కృష్ణ, టి.సుధాకర్, బి.దొమయ్య పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్రంలో చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని జాతీయ చేనేత సమాఖ్య జిల్లా అధ్యక్షులు అల్లాడ సూర్యనారాయణరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో 2 లక్షల మంది మగ్గం నేసే కార్మికులు, 70 వేల మంది ఉప కార్మికులు ఉన్నారని తెలిపారు. అయితే గత ప్రభుత్వం నేతన్న నేస్తం కేవలం రూ.73 వేల మందికే అమలు చేశారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికులను గాలికొదిలేశాయని తెలిపారు. చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30న రాష్ట్రంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి చేనేత కార్మికుడూ ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - ఆచంట

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆచంట పంచాయతీ కార్యదర్శి జివిఎన్ఎల్.నరసింహారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆచంట చిన్న పేటలో కాలానుగుణంగా వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఇటీవల ముంపునకు గురైన చిన్నపేట మండల ప్రజా పరిషత్ పాఠశాల వద్ద పారిశుధ్య కార్మికులు బ్లీచింగ్ చల్లారు. వర్షాలు నేపథ్యంలో డయేరియా, డెంగీ తదితర విషజ్వరాలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. ఎక్కడా చెత్తకుప్పలు, తాగునీటి పైప్‌లైన్ లీకేజీ లేకుండా చూస్తున్నామన్నారు.

సమస్యలకు భయపడొద్దు

ప్రజాశక్తి - తణుకు

ప్రతి వయస్సు వారికీ ఏదో ఒక సందర్భంలో సమస్య ఎదురౌతుందని, దాన్ని పరిష్కరించుకోవాలి తప్ప భయపడకూడదని సైకాలజిస్టు వి.ధనశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు జాతీయ సేవా పథకం వారి ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ డాక్టర్ సుందరీబాయి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ధనశేఖర్ మాట్లాడుతూ ఉన్న వయస్సు ఎప్పటికీ తిరిగిరాదని, జీవితంలో ఏదైనా సాధించాలంటే ఆ వయస్సే ముఖ్యమని తెలిపారు. మంచి స్నేహం, పోటీతత్వం, న్యూస్ పేపర్ చదవడం, ముఖ్య వ్యక్తుల జీవిత చరిత్రలు చదివి ఒత్తిడిని తగ్గించుకోవాలన్నారు. టివి, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంటే విజయానికి చేరువవుతారని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ సుందరీబాయి మాట్లాడుతూ వ్యసనాల బారిన పడొద్దన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కెవి.శ్యామలాదేవి, సిహెచ్ రమేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ ఎంట్రన్స్ బుక్స్ పంపిణీ

పాలకొల్లు :నవోదయ ఎంట్రన్స్ పరీక్షలో విద్యార్థులు అత్యధిక సాధించి పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తేవాలని ప్రముఖ దాత శ్రీకొల్లు కామేశ్వరరావు మైధిలి దంపతులు అన్నారు. పాలకొల్లు పట్టణ పరిధిలోని జివిఎన్ఎస్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శ్రీకొల్లు కామేశ్వరరావు మైధిలి దంపతులచే నవోదయ ఎంట్రన్స్ బుక్స్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల అవసరాలకు సౌకర్యాల కల్పనకు తమ వంతు సహకారం ఎప్పటికీ ఉంటుందని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పిఎంసి ఛైర్మన్ కరణం పాపారావు, వైస్ ఛైర్ పర్సన్ సున్నం లక్ష్మి, ప్రధానోపాధ్యాయులు భవానీప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - గణపవరం

ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకూ గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు గణపవరం జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌కు చెందిన ఎం.అఖిల్, వర్మ ఎంపికైనట్లు హైస్కూల్ పిడి ఎ.పద్మావతి బుధవారం చెప్పారు. విద్యార్థులు ఎనిమిదో తరగతి చదువుతున్నారని తెలిపారు. తణుకు చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి ఆటల పోటీల్లో పరుగు, లాంగ్ జంప్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని తెలిపారు. ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారిని స్కూల్ యాజమాన్యం అభినందించింది.

పేద కుటుంబానికి సిమెంట్ బస్తాలు అందజేత

పాలకొల్లు :పోడూరు మండలం వేడంగిపాలెం గ్రామ ఎస్‌సి కాలనీలో నివాసం ఉంటున్న కర్ర ఇందిర, నాగబాబుకు ధర్మరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 20 సిమెంట్ బస్తాలు అందజేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచారంలో మంత్రి నిమ్మల రామానాయుడును నిరుపేద కుటుంబానికి చెందిన ఆ ఇరువురు కలిసి తమకు ఇల్లు లేదని, కనీసం రేకుల షెడ్డు ఏర్పాటుకు అవసరమైన గోడల నిర్మాణానికి సిమెంట్ బస్తాలు ఇప్పించాలని కోరగా తప్పకుండా చేస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగానే ఫౌండేషన్ ద్వారా అందజేశారు. కార్యక్రమంలో మీసాల సత్యనారాయణ, దుసనపూడి దొరబాబు(ఎంపిటిసి), లంకలపల్లి రవీంద్ర ప్రసాద్, లంకలపల్లి గంటయ్యనాయుడు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రైతు కష్టం.. నీటి పాలు..!

రైతుల ఆవేదన

ప్రజాశక్తి - ఆకివీడు

ఆరుగాలం రైతు కష్టం మొత్తం నీటి పాలైంది. దీంతో సార్వా రైతుకు కన్నీరే మిగిలింది. ఈ సారి సార్వా సాగుకు ఆది నుంచి హంసపాదే ఎదురైంది. విత్తనాలు జల్లిన సమయంలో తీవ్ర ఎండలతో సకాలంలో నీరందని పరిస్థితి. ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి, ఇంజిన్లతో నీళ్లు తోడుకొని వరి ఆకును సిద్ధం చేసుకుని రైతులు నాట్లు పూర్తిచేశారు. ఇప్పటికే పెట్టుబడి రెట్టింపు అయ్యింది. ఎరువులు, దమ్ము ఇలా ఎకరాకు రూ.25 వేల వరకూ పెట్టుపడి పెట్టారు. అంతా బాగానే ఉందనుకున్న సమయంలో ప్రకృతి తుపాను రూపంలో పగబట్టింది. వరి నాట్లు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంజిన్లతో నీరు తోడడం, గట్లు కొట్టి నీటిని మళ్లించే పనుల్లో నిమగ్నమయ్యారు. అయినా నీరు కదలని పరిస్థితి. మూడు అడుగుల మేర నీరు ఉండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు నీరు తగ్గినా ఆకు ఎంతవరకూ దక్కుతుందన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే వారం రోజుల నుంచి వరి నీటిలో నాని కుళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా సార్వా చివర్లో నవంబరు, డిసెంబర్లో తుపాన్లు వస్తాయి. అయితే ఈసారి సాగు చేపట్టిన కొద్ది రోజులకే తుపాన్లు వెంటాడడం ఆకు మడులు కుళ్లిపోవడంతో సాగు చేయాలా వద్దా అనే ప్రశ్నార్థకంలో రైతులు పడ్డారు.

నీట మునిగిన పొలాలు

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - పోడూరు

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో 2005 సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది, స్థానిక పౌరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కమిషనర్ చావలి సునీల్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి పౌరుడూ సమాచార హక్కు గురించి తెలుసుకొని చట్టాన్ని వజ్రాయుధంలా ఉపయోగించుకోవాలన్నారు. ఈ చట్టం వల్ల ప్రతి అధికారికీ పారదర్శకత, జవాబుదారీ తనం పెరుగుతుందన్నారు. సమాచారం కోరిన 30 రోజుల్లోగా సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రాజేష్, ఆర్ఐ కందుల రాంబాబు, మండల ప్రజా పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారి ఎం.శ్రీనివాసరెడ్డి, ఎఇపిఆర్.ఏడుకొండలు, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి సత్యనారాయణ

ఆసుపత్రి భవనాన్ని వెంటనే ప్రారంభించాలి

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక 17వ వార్డు సమతానగర్ రోడ్డులోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (అర్బన్ హెల్త్ సెంటర్) నూతన భవనంలో తక్షణం వైద్య సేవలు ప్రారంభించాలని పట్టణ పౌరుల సంక్షేమ సంఘం కన్వీనర్ బివి.వర్మ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వ హయాంలో రూ.1.10 కోట్లతో సమతానగర్ రోడ్డులో పట్టణ ఆరోగ్య కేంద్ర భవనాన్ని నిర్మించారని, నిర్మాణం పూర్తయి ఏడు నెలలు గడిచినా ఇప్పటివరకు వైద్య సేవలు ప్రారంభం కాకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని వాపోయారు. వైద్య సేవలు ప్రారంభం కాకపోవడం వల్ల ప్రభుత్వం నిర్మించిన ఈ భవనంలో నిత్యం అల్లరి మూకలు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. భవనం అద్దాలను, కిటికీలు, తలుపులను పూర్తిగా ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. తక్షణం ప్రభుత్వ వైద్య సేవలు ప్రారంభించాలని, దీని పరిధిలో ఉన్న 2000కు పైగా ఉన్న కుటుంబాలకు వైద్య సేవలందించాలని అధికారులను కోరారు. భవన నిర్మాణ పనులను కాంట్రాక్టర్ చివరి దశలో నిలిపివేశారని, అందుకు గల కారణాలను తెలుసుకొని త్వరితగతిన పనులను పూర్తి చేసి ఆరోగ్య కేంద్రాన్ని తక్షణం తెరిపించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి రక్షణ కల్పించాలని కోరారు.

లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆచంట

గోదావరి వరద ఉధృతి నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు తప్పక పాటించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆచంట మండలం కరుగోరుమిల్లి, అయోధ్యలంక, మర్రిమూలలంక గ్రామాల్లో ఆయన పర్యటించి లంకవాసులతో మాట్లాడారు. గోదావరి వరద ఉధృతిని పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని ప్రజలకు సూచించారు. పడవ, మోటారుసైకిలు, ట్రాక్టరుపై పయనిస్తూ సుడిగాలి పర్యటన చేశారు. మెడికల్ క్యాంప్, అంగన్వాడీ సెంటర్, గ్రామ సచివాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ లంకగ్రామాల ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలోనే మకాం వేయాలన్నారు. అవసరమైన పక్షంలో అంతా తప్పనిసరిగా పునరావాస కేంద్రాలకు తరలి రావాలన్నారు. లంక గ్రామాల్లో తొమ్మిది, మిగిలిన చోట్ల నాలుగు మొత్తం మండలంలో 13 పునరావాస కేంద్రాలు ఉన్నాయని ఇన్‌ఛార్జి తహశీల్దార్ డి.సుగుణ సంధ్య తెలిపారు. ఆయన వెంట ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్, డిఎస్‌పి ఎన్‌బిఎం.మురళీకృష్ణ, ఎంపిడిఒ పి.నరసింహాప్రసాద్, మత్స్య శాఖ సహాయ సంచాలకులు సిహెచ్.వెంకటేశ్వరరావు, మండల మత్స్య శాఖాధికారి ఏడుకొండలు, గ్రామ సర్పంచి కడలి కృష్ణవేణి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరందించాలి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - నరసాపురం

మల్లవరం లంకలో కుళాయి చెరువు, పంప్‌హౌస్‌ను ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ బుధవారం పరిశీలించారు. పంప్ హౌస్‌లోకి వర్షపు నీరు వెళ్లడంతో ఇబ్బంది అవుతోందని, దీనివల్ల పంపు మోటార్లు కలిపోతున్నాయని ఎంఎల్‌ఎ నాయకర్‌కు స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా నాయకర్ కుళాయి చెరువు చుట్టూ తూడు తొలగించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు సురక్షిత నీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో, బందేల రవీంద్ర, వలవల నాని, గంటా కృష్ణ, కుసుమ కిరణ్ పాల్గొన్నారు.

తంతి, తపాలా సేవలపై అవగాహన

గణపవరం:గణపవరం డిగ్రీ కాలేజీలో తంతి తపాలా సేవలపై విద్యార్థులకు, స్థానికులకు అవగాహనా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడుతూ ప్రజలకు తంతి తపాలా శాఖ అందిస్తున్న పొదుపు ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. తాడేపల్లిగూడెం పోస్టుమాస్టారు ఐ.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తంతి తపాలాశాఖ సేవలు, పొదుపు పథకాలు విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపల్ వై.మధురాజు, స్థానిక పోస్టు మాస్టారు విజయ్, లెక్చరర్ సిహెచ్ చైతన్య, అధ్యాపకులు, కాలేజీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

రామ్మోహన్‌నాయుడును కలిసిన ఎస్ఐ

నరసాపురం:టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడును నరసాపురం ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సిహెచ్.జయలక్ష్మి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ జయలక్ష్మికి ఆయన అభినందనలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలకు కృషి చేయాలని సూచించారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - ఉండి

గర్భిణులు, చిన్నారులు పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యను అధిగమించొచ్చని మహదేవపట్నం గ్రామ సర్పంచి వనిమా నాగవెంకట సుబ్బలక్ష్మి అన్నారు. ఐసిడిఎస్ యండగండి సెక్టర్ సూపర్‌వైజర్ వి.నిర్మల ఆధ్వర్యంలో మహదేవపట్నంలో పౌష్టికాహార మహోత్సవంలో భాగంగా నిర్వహించిన పోషకాహార పంపిణీ కార్యక్రమంలో వనిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకోవాలని, తద్వారా వారిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. అనంతరం ఎనీమియాపై క్విజ్ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పెనుమంట్ర:మండలంలోని ఆలమూరు శివారు కోమటి చెరువు, జుత్తిగ, మార్టేరు-2 అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా కార్యక్రమాలు నిర్వహించినట్టు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి ఎ.కృష్ణకుమారి తెలిపారు. ప్రతి గ్రామంలో అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న పోషకాహార కార్యక్రమాలకు మంచి స్పందన వస్తోందన్నారు. ఉపాధ్యాయులు, పెద్దలు, తల్లులు, గర్భిణులు, పిహెచ్‌సి సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొని విజయవంతం చేస్తున్నారని తెలిపారు.

మొగల్తూరు : ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సిడిపిఒ బి.ఊర్మిళ సూచించారు. రామన్నపాలెంలో పౌష్టికార మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కిశోర బాలికలకు, గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో అవగాహనా ప్రదర్శన చేశారు.

ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి

తాడేపల్లిగూడెం:తెలంగాణ భూ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి కార్యక్రమం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో యండమూరి నాగేంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి మడకా రాజు ముఖ్యఅతిథిగా హాజరై ఐలమ్మ, రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోరాట పటిమను రజకులందరూ ఆదర్శంగా తీసుకుని, జాతిహక్కుల కోసం ఉద్యమించాలన్నారు. ఏ గ్రామంలోనైనా రజకులపై దాడులు, దౌర్జన్యాలు జరిగితే ఐలమ్మ చూస్తూ ఊరుకోకుండా హక్కుల కోసం పోరాటం చేసేదన్నారు. కార్యక్రమంలో బి.నాగరాజు, దుర్గా భవానీ, గంగా భవానీ, నాగేశ్వరరావు, రాములు, టేకు శ్రీను, సత్యనారాయణ పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం అభినందనీయం : ఎంఎల్‌ఎ

తణుకు:విజయవాడ వరద బాధితులకు అండగా నిలుస్తూ తణుకు నియోజకవర్గం నుంచి పలు వ్యాపారస్తులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి సాయమందించడం అభినందనీయమని ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కొనియాడారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయం వద్ద వరద బాధితుల సహాయార్థం రూ.10,75,116 చెక్కులను ఎంఎల్‌ఎ అందజేశారు. అమెరికాలో ఉంటున్న ఎన్‌ఆర్ఐ బోళ్ల శ్రీనివాస్, బోళ్ల రమేష్ సోదరులు రూ.లక్ష, తణుకు పెట్రోల్ బంకు అసోసియేషన్ వారు రూ.లక్షా 50 వేలు, తణుకు హోటల్స్ అసోసియేషన్ తరపున రూ.లక్ష, డాక్టర్ భోగవల్లి వెంకట్రావు రూ.లక్ష, వేల్పూరు గ్రామానికి చెందిన పోలేపల్లి సూర్యచంద్రరావు దంపతులు రూ.లక్ష, తణుకు అఫీషియల్స్ క్లబ్ వారు రూ.లక్ష, డా.దొమ్మేటి సుధాకర్ రూ.10 వేలు, దంగేటి శ్రీనివాసరావు, రూ.5 వేలు, యలమర్తి శ్రీనివాసరావు రూ.5,116లు, కంటిపూడి రాంబాబు రూ.20 వేలు, గుర్రం నారాయణ రూ.10 వేలు అందించారని తెలిపారు. శ్రీకరి ఎంఆర్ఐ స్కానింగ్ సెంటర్ వారు రూ.50వేలు, శ్రీకరి డయాగ్నోసిస్ వారు రూ.50వేలు, స్వాతి ఆర్చ్ వెల్డింగ్ వారు రూ.5వేలు, బోడపాటి నారాయణరాజు రూ.10 వేలు, సింహాద్రి వెంకటరత్నం, రూ.10వేలు, పులి ఆంజనేయులు రూ.25వేలు, కాపకాయల వెంకటేశ్వరరావు రూ.5వేలు, శ్రీను గోపాలం రూ.10వేలు తదితరులు చెక్కు అందజేశారు.

సమాజ సేవ ఎంతో ముఖ్యం

బివి రాజు విద్యాసంస్థల ఆపన్న హస్తం అభినందనీయం

కలెక్టర్‌కు రూ.25 లక్షల వరద సాయం అందజేత

ప్రజాశక్తి - భీమవరం

సంపాదించడం ఎంత ముఖ్యమో సమాజ సేవకు దాతృత్వం కలిగి ఉండడం అంతే ముఖ్యమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కలెక్టరేట్‌లో బివి.రాజు (విష్ణు కళాశాల) విద్యాసంస్థల ఛైర్మన్ కెవి.విష్ణురాజు విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.25 లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ నాగరాణికి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బివి రాజు కళాశాలల యాజమాన్యం పెద్ద మొత్తంలో సహాయం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. బివి రాజు విద్యాసంస్థలు సాయమందించడంలో ముందు వరుసలో నిలుస్తాయన్నారు. బివి రాజు విద్యాసంస్థల్లో లక్షలాది మంది విద్యనభ్యసించి ప్రయోజకులు కావడానికి ఆనాడు బీవీ రాజు ముందు చూపుతో గొప్ప దాతృత్వం కలిగి ఉండటం కారణమన్నారు. దీని గురించి ఎంత చెప్పినా తక్కువే అన్నారు. నూతన జిల్లాగా ఏర్పడి సరైన మౌలిక వసతులు లేక ఇబ్బంది పడుతున్న సమయంలో బీవీ రాజు విద్యాసంస్థలు వసతి గృహాలు, సమావేశ మందిరాలను వినియోగించుకోవడానికి జిల్లా యంత్రాంగానికి నిరంతర సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. విద్య సంస్థల ఛైర్మన్ విష్ణు రాజు మాట్లాడుతూ విజయవాడ వరద పరిస్థితిని చూసి చలించిపోయానన్నారు. బాధితులకు నిరంతరం ప్రభుత్వం సహాయపడుతోందని తమ వంతు రూ. 25 లక్షలు అందించడం జరిగిందని తెలిపారు.


కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న బివి.రాజు విద్యాసంస్థల ఛైర్మన్ విష్ణురాజు

ముఖ్యమంత్రి సహాయనిధికి రూ 47, 88,500 జమ

విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి జిల్లా నుంచి రూ. 47,88,500 జమ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ నాగరాణి తెలిపారు. 13 మంది దాతలు ఈ మొత్తం ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు. దాతలు పెద్ద ఎత్తున వరద బాధితులకు వివిధ ఆహారం పదార్థాలను అందజేసి జిల్లా దాతృత్వంలో మొదటి స్థానంలో నిలిపారన్నారు. 4.09 లక్షల ఆహార పొట్లాలు, 1.85 లక్షల వాటర్ బాటిల్స్, 1.10 లక్షల వాటర్ ప్యాకెట్లు, 9,500 బన్నులు, 21,400 రస్కులు, 1.62 బిస్కెట్ ప్యాకెట్లు, 25 కేజీల బియ్యం బస్తాలు 700 అందజేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బంది కలిగిన జిల్లా ప్రజలు తమ దాతత్వాన్ని చాటుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు పాల్గొన్నారు.

ఇంటికి చేరిన గల్ఫ్ బాధితులు

ప్రజాశక్తి - నరసాపురం

ఏజెంట్ మోసంతో గల్ఫ్‌లో చిక్కుకుని ఓ ఇంట్లో మూడు నెలలుగా బందీలుగా ఉన్న పట్టణంలోని 9వ వార్డుకు చెందిన ఇద్దరు మహిళలు మంగళవారం రాత్రి నరసాపురం చేరుకున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యక్తిగత శ్రద్ధ చూపించి ఖత్తర్ విదేశాంగ అధికారులతో స్వయంగా మాట్లాడి, ఇండియన్ ఎంబసీని అప్రమత్తం చేయడంతో మహిళలు ఇద్దరూ నరసాపురం వచ్చి పిల్లలు, బంధువులను చూడగలిగారు. పట్టణంలోని 9వ వార్డుకు చెందిన ఉండవల్లి రామలక్ష్మి, వాతాడి ముత్యాల అరుణను అదే ప్రాంతానికి చెందిన ఏజెంట్ బొమ్మిడి కొండాలమ్మ ఓ ఇంట్లో పని నిమిత్తం ఖత్తర్ పంపింది. ముందు ఫ్లైట్ టికెట్లకు డబ్బులిస్తే అక్కడకు వెళ్లి పనుల్లో చేరాక మరికొంత సొమ్ము ఇస్తే సరిపోతుందని చెప్పింది. నెలకు ఒకొక్కరికీ రూ.30 వేల జీతం వస్తుందని నమ్మపలికింది. దీంతో ఇద్దరు మహిళలు రూ.30 వేలు కొండాలమ్మకు ఇచ్చి మే 1వ తేదీన ఖత్తర్ వెళ్లారు. అయితే కొండాలమ్మకు జోడీగా ముంబైలో ఉండే మరో ఏజెంట్ ఖత్తర్లో ఇద్దరు మహిళలను ఓ కంపెనీకి అమ్మేశాడు. ఆ కంపెనీ వారు వీరిని ఓ గదిలో బంధించి వేధించారు. అయితే ఓ తెలుగుమహిళ వీరికి దొంగచాటుగా ఫోన్ ఇవ్వడంతో రామలక్ష్మి ఇండియాలో ఉన్న తన భర్త పెద్దిరాజుకు ఫోన్ చేసి విషయం చెప్పి లొకేషన్ షేర్ చేసింది. దీనిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకున్న నిర్మాలా సీతారామన్ వెంటనే కేంద్ర విదేశాంగ మంత్రి, విదేశాంగ అధికారులతో మాట్లాడారు. ఈ నెల 9వ తేదీన వారిని వారి చెర నుంచి విడిపించి ఇండియాకు రప్పించారు.

బండి ముత్యాలమ్మకు రూ.9.89 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - మొగల్తూరు

బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయం రూ.9,89,895 సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు తెలిపారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలోని బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించామన్నారు. 45 రోజులుగా అమ్మవారికి యాత్రికులు, కానుకలు, మొక్కుబడుల రూపంలో చెల్లించుకున్న ఆదాయాన్ని భీమవరం దేవాలయాల ఇన్‌స్పెక్టర్ వర్ధనీడి వెంకటేశ్వర పర్యవేక్షణలో లెక్కించామని రామకృష్ణంరాజు తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

అధ్యాపకులు కావాలి

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీలో సైన్సు సబ్జెక్టు బోధించడానికి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు కోరినట్లు కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఎంఎస్ఇ కంప్యూటర్‌లో పోస్టు గ్రాడ్యుయేట్‌లో 50 శాతం మార్కులు పొంది ఉండాలని చెప్పారు. అభ్యర్థి పిహెచ్‌డి, నెట్ లేక ఎస్‌ఎల్ఇటి కలిగిన వారికి ప్రాధాన్యత ఉటుందని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 16వ తేదీలోపు కళాశాలకు దరఖాస్తులు అందజేయాలని కోరారు. దరఖాస్తుదారుడు మౌఖిక పరీక్షకు హాజరు కావాలని తెలిపారు. 79010 56668 నంబర్‌కు ఫోన్‌చేసి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

వీరవాసరం :

వీరవాసరంలోని ఎస్‌విఎస్ అండ్ విజిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.ప్రభువరం తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంఎ ఇంగ్లీషులో 50 శాతం తక్కువ కాకుండా ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ఒరిజినల్ పత్రాలతో పాటు ఒక సెట్ నకలు పత్రాలతో ఈ నెల 13న ఉదయం 10 గంటలకు వీరవాసరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాజరుకావాలని కోరారు.

అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి - తణుకు

జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు బుధవారం చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ కళాశాల వద్ద నిర్వహించినట్లు అసోసియేషన్ సెక్రటరీ సంకు సూర్యనారాయణ తెలిపారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఛైర్మన్ మానేపల్లి శ్రీనివాస్ తెలిపారు. అథ్లెటిక్స్ పోటీలను అసోసియేషన్ అధ్యక్షులు చింతకాయల సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం పారిస్ ఒలింపిక్స్ వరకూ వెళ్లిన దండి జ్యోతికశ్రీనిజిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. విజేతలకు సర్టిఫికేట్స్, మెడల్స్ గంట రవికుమార్ అందించగా, క్రీడాకారులకు మానేపల్లి శ్రీనివాసు భోజనాలు ఏర్పాటుచేశారు. ఈ పోటీల్లో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 40 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి కె.బాబూరావు, వ్యాయమ ఉపాధ్యాయులు ఎన్‌వి.సత్యనారాయణ, వినోద్, నాగరాజ్యం పాల్గొన్నారు.

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టు రాజమహేంద్రవరం

M.V.O.P.118/2023

Between:
1. Polinati Ranga Rao
2. Polinati Baby
3. Polinati Sujatha ...Petitioners

And

Kamireddy Veera Venkata Subrahmanyam, and others ...Respondents

R3. Amirapu Peddi Raju, S/o.Jayarama Krishna, Hindu, Male, Aged 48years, Owner(As per Insurance Policy) of Tata Ace Van bearing **No.AP-37-TA-3858,** R/o.D.No.2-56, Kalla Village and Mandalam, W.G.Dt.Bhimavaram DMC. **...3rd Respondent.**

పై నంబరు పిటీషన్‌లో 3వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. **30-09-2024** సం॥రం తేదీ ఉదయం **10.30** ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటీషను లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటీషను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

బి.మహేష్‌కుమార్
అడ్వకేటు
రాజమండ్రి
8885551188

రాజమండ్రి
11-09-2024

మహారాజశ్రీ 2వ అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), తాడేపల్లిగూడెం వారి కోర్టులో

E.P. 63/2022 in O.S. 96/2022

Between:

కవల నాగరాజు ...DHR

AND

కాకర్ల రామ సుబ్బారావు ...JDR

పై నెంబరు E.P. గ్రంధములో DHR కు రావలసిన బాకీ గురించి JDR కు చెందిన ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని **ది. 3-10-2024వ తేదీన పైన తెల్పిన కోర్టులో ఉదయం గం॥ 10.30 ని॥లకు** వేలము వేయుటకు శ్రీ కోర్టు వారు ఆర్డరు వేసియున్నారు. కావున వేలం పాటలో పాల్గొనదలచినవారు పై తెలిపిన తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై వేలం పాటలో పాల్గొని పాడుకొనవచ్చును. సదరు వేలమునకు వేలము షరతులు వర్తించునని యిందు మూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

ప॥గో॥జిల్లా, తాడేపల్లిగూడెం సబ్‌రిజిస్ట్రీ, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ, 2వ వార్డు వానపల్లిగూడెం రోడ్, విజ్ఞాన్ వికాస్ స్కూల్ ఎదురుగా, డో.నెం. 4-88-2 (2) అసెస్మెంట్ నెం. 16088 గా గల 160 చ॥గ॥ స్థలము మరియు అందలి గల రెండు పోర్షన్ల రేకుల షెడ్డుకు హద్దులు. **తూర్పు:** కాకర్ల శ్రీను గారి ఇల్లు. **దక్షిణం:** రోడ్. **పడమర:** రోడ్. **ఉత్తరం:** కానూరి సత్యనారాయణ గారి ఇల్లు.

పై హద్దుల మధ్య గల 160 చ॥గ॥ స్థలము మరియు అందలి గల రెండు పోర్షన్ల రేకుల షెడ్డు, రూఫ్, తలుపులు, కిటికీలు, కరెంటు కనెక్షన్, ట్యాప్ కనెక్షన్ మొ॥ సర్వం సహా అన్ని యీజిమెంట్ హక్కులతో సహా.

Sk.Md.బాషా (SMB)
అడ్వకేట్, తాడేపల్లిగూడెం